క్లుప్తంగా

ఆరోగ్యంపై అవగాహన

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు పీహెచ్‌సీ పరిధిలోని ప్రభలవీడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గురువారం స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ జయరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ ప్రజలందరూ ఉచిత వైద్య పరీక్షలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఎంఎల్‌హెచ్‌పీలు దేవిక, జాహ్నవి, గౌతమి, పంచాయతీ కార్యదర్శి రమణయ్య, అంగన్వాడీ కార్యకర్తలు సుభద్ర, ఈశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు రామలక్ష్మి, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

28న జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ బీ.వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌వుయ్‌కెన్ ఫోకస్ సంస్థవారు సేల్స్ ప్రమోటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 10 నుంచి అంతకంటే పై చదువులు చదివిన అభ్యరులు అర్హులని, ఎంపికైన వారికి రూ.8000 నుంచి రూ.25000 సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు 10వ తరగతి మార్కులిస్టు జిరాక్స్, ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7989826581 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

భగవద్గీత పారాయణం

కాశినాయన : మండలంలో రెడ్డి కొట్టాల ఎస్టీ కాలనీలోని రామాలయంలో గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడప, అన్నమయ్య జిల్లాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపి బాబు ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. 27వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు రవీంద్ర బాబు, చెంద్రాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్ బాబు, ఆదిలక్ష్మి, చెన్న కృష్ణయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

చాపాడు : మండలంలోని కేతవరం గ్రామంలో గురువారం జరిగిన వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరయ్యారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గొడుగు చంద్ర కుమారుడు చిన్న రాజ, సంధ్యల వివాహ వేడుకలను సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించారు. రఘురామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జి.సుందర్‌రామిరెడ్డి మాతృమూర్తి గుర్రంపాటి సుబ్బమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ గురువారం వల్లెరవారిపల్లెలో సుబ్బమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి తోట నాగేశ్వర్‌రావు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పుత్తా శ్రీరాములు, మున్సిపాలిటీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కేశవరెడ్డి, బద్వేలు, అట్లూరు మండలాల అధ్యక్షులు మల్లేశ్వర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, బిజ్జం రమణ, అనిల్, మౌలాలి, కుప్పాల రమణ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పోరుమామిళ్ల: గర్భిణులు పౌష్టిక ఆహారం తీసుకోవాలని, కుటుంబంలో ఆరోగ్య నిర్ణయాలలో మహిళ నాయకత్వం వహించాలని, ఆత్మ విశ్వాసం పెంచుకోవాలని డాక్టర్ కరిష్మ పేర్కొన్నారు. గురువారం రాజాసాహెబ్‌పేట ఆరోగ్య కేంద్రంలో జరిగిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిర్మల, యంఎల్‌హెచ్‌ఓ సంధ్య, ఏఎన్‌ఎం కళావతి, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ ఖాదర్‌బాషా, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చెట్లను నరికించిన మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చెట్ల క్రింద సేద తీరుతుంటారన్నారు. పాత భవనాలపై ఆకులు రాలి వర్షపు నీరు నిలుస్తుందని చెట్లను కొట్టించారన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండా ఇంజినీర్ వీటిని తొలగించారన్నారు.


ఆన్‌లైన్ సమస్యను పరిష్కరించాలి

చాపాడు : గిరిజన కుటుంబానికి చెందిన వారసత్వ భూమికి సంబంధించి ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య గురువారం డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. శ్రీరాములపేట గ్రామానికి చెందిన నల్లగొండ లక్ష్మయ్య నుంచి వారసత్వంగా మల్లేషుకు సర్వే నెంబరు 90/2ఏలో 0.49 ఎకరాల సాగు భూమి చేసుకుంటున్నారన్నారు.

మాతా.. అన్నపూర్ణేశ్వరి


ప్రొద్దుటూరు కల్చరల్: అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు


ప్రొద్దుటూరు కల్చరల్: ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో..


బద్వేలు అర్బన్ : వీరభద్రస్వామి ఆలయంలో జగన్మోహినీదేవి అలంకారం


కలసపాడులో కాత్యాయినిదేవి అలంకారంలో అమ్మవారు


బద్వేలు అర్బన్ : కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు


ప్రొద్దుటూరు: అన్నపూర్ణ దేవి అలంకారంలో పెద్దమ్మ తల్లి


ప్రొద్దుటూరు కల్చరల్ : మాతా... అన్న పూర్ణేశ్వరి అంటూ భక్తులు అమ్మవారిని శరణు వేడారు. దేవీ శరన్నవరాత్రుల వేడుకల్లో నాలుగో రోజైన శుక్రవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ దేవతా మూర్తులు, వివిధరకాల తినుబండారాలు అమ్మవారి చెంత ఉంచారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో, శివాలయం, అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో భక్తులకు గజలక్ష్మీదేవి, మోడంపల్లె పెద్దమ్మతల్లి ఆలయంలో పార్వతీదేవి భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణదేవి అలంకారం


ప్రొద్దుటూరు : దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక హౌసింగ్ బోర్డులోని పెద్దమ్మ తల్లి ఆలయంలో గురువారం అన్నపూర్ణదేవి అలంకారంతో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

లోక నాయకి.. పాహిమాం!

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని బద్వేలు నియోజకవర్గంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆయా ఆలయాల్లో నిర్వహించే అమ్మవారి అలంకారాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఆలయాల నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


ప్రొద్దుటూరు శివాలయంలో అన్నపూర్ణాదేవి


బద్వేలు అర్బన్ : వీరభద్రస్వామి ఆలయంలో..


పోరుమామిళ్ల : కామాక్షిదేవి అలంకారంలో..


కాశినాయన: నర్సాపురంలో అన్నపూర్ణాదేవిగా..


బ్రహ్మంగారిమఠం : అన్నపూర్ణదేవిగా ఈశ్వరీమాత

రేపటి నుంచి ధ్యాన దసరా ఉత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పొట్లదుర్తి గ్రామం బిస్మిల్లా బాద్‌లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి పిరమిడ్ ధ్యాన మహాక్షేత్రంలో శనివారం నుంచి సోమవారం వరకు ధ్యాన దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ధ్యానకేంద్రం అధ్యక్షురాలు కె.ప్రత్యూష, కోశాధికారి రవ్వా అనిల్‌కుమార్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో రోజు సామూహిక సంగీత ధ్యానం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బ్రహ్మర్షి పత్రీజీ సందేశాలు, విశిష్టఅతిథుల పరిచయం, సీనియర్ పిరమిడ్ మాస్టర్ల సందేశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పత్రీజి కుమార్తె పరిణితి, అల్లుడు శ్రీనివాసరెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ వి.జయలక్ష్మి, ట్రస్టీ సి.సుజనాదేవి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

బద్వేలు అర్బన్ : ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఆసుపత్రుల్లో పనిచేసే వివిధ విభాగాల వైద్యుల పేర్లు రిజిస్ట్రేషన్ నెంబర్లతో సహా ప్రదర్శించాలని తెలిపారు. అలాగే స్కానింగ్ మిషన్ ఉంటే దాని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో పాటు గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని తెలిపే బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, సీహెచ్‌ఓ చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్లు శివరామిరెడ్డి, వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్‌రావు, శ్రీరాములయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్

ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి సర్టిఫికెట్లు

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ (పీటీడీ) డిపోలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి గురువారం సంస్థ ఎండీ ద్వారకాతిరుమలరావు సర్టిఫికెట్లను అందజేశారు. డిపోలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపోలో సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించిన ఏడీసీలు ఎం.లక్ష్మయ్య, ఎం.ఉమాదేవి, కండక్టర్లు కేసీ కొండయ్య, నాగలక్ష్మి, డ్రైవర్లు సత్తార్, టి.శ్రీనివాసులుకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ ధర్మతేజ, సీఎంఈ చంగల్ రెడ్డి, డిపో మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


ఏడీసీ లక్ష్మయ్యకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

పండిత్ దీన్‌దయాల్‌కు ఘన నివాళి

ప్రొద్దుటూరు : పండిత్ దీన్‌దయాల్ జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదారి సరేంద్ర తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఐక్యత, మానవత్వం, అంత్యోదయ అమరదీపాన్ని వెలిగించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చెన్న మోహన్‌కుమార్, ముత్యల శ్రీశ్రీ, పట్టణకార్యదర్శి హరికృష్ణతో పాటు కుమారి, ప్రసన్న, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.


పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ప్రజా సమస్యలపై బాధ్యతారాహిత్యం

మైదుకూరు : ప్రజా సమస్యలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ పలువురు కౌన్సిలర్లు గైర్హాజరు కావడంతో మైదుకూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం కోరం లేక వాయిదా పడింది. చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి నలుగురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ఒక టీడీపీ కౌన్సిలర్ మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో ఇటీవల మృతి చెందిన ఐదో వార్డ్ కౌన్సిలర్ ఖాదర్‌బాషా చిత్రపటం వద్ద సంతాపం ప్రకటించి సమావేశాన్ని వాయిదా వేశారు. మూడు నెలలకోసారి సమావేశమై వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన కౌన్సిలర్లు సమావేశానికి డుమ్మా కొట్టడంపై విమర్శలు వస్తున్నాయి. సమావేశానికి మున్సిపల్ అధికారులు వార్డు సచివాలయాల సిబ్బంది మినహా అధికారులు హాజరు కాలేదు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు నిర్లక్ష్యం, ఉదాసీనత ఉందో వారి గైర్హాజరు తెలియజేస్తోంది.

పిల్లలు, మహిళల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

ప్రొద్దుటూరు క్రైం : చిన్న పిల్లలు, మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం స్వస్థ్ నారీ స్వసక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతా, మున్సిపల్ కమిషనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని శ్రీరాములపేటలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, కమిషనర్ మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమశాఖ ద్వారా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్‌నారాయణ, టీడీపీ నాయకుడు గంటసాల వెంకటేశ్వర్లు, బీజేపీ పట్టణాధ్యక్షుడు నరేంద్ర, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకు ముడుత నివారణకు చర్యలు తీసుకోవాలి

కాశినాయన : మండలంలోని రెడ్డి కొట్టాల గ్రామంలో గురువారం వరి పంటను ఏఈఓ రవి పరిశీలించారు. వరి పంటకు ఆకు ముడత తెగులు సోకినట్లు గుర్తించిన ఏఈఓ రైతులకు సూచనలు చేశారు. దీని నివారణకు ఓరాజిన్ 80 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రోటరీకంటి ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం, శనివారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు 60 ఏళ్లు పైబడిన వారికి, అలాగే షుగర్ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08564 247012, 6303448294 నంబరులను సంప్రదించాలని ఆస్పత్రి అధ్యక్షుడు కోట శివకుమార్, కార్యదర్శి ఎంవీఎస్ ప్రభు తెలిపారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు : వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. స్థానిక శ్రీరాములపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని గురువారం కమిషనర్ ప్రారంభించారు. ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం వలన మహిళలకు ఎంతో ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయండి

కలసపాడు : కలసపాడు గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు గురువారం ఎంపీడీఓ మహబూబ్‌బీకి వినతిపత్రం అందజేశారు. కలసపాడులోని పశువుల ఆసుపత్రికి వెళ్లే దారి వర్షం వస్తే లోపలికి వెళ్లలేక పశువుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, మూడు రోడ్ల కూడలిలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి హిందూ శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మించాలని వారు కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బి.కోడూరు : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. గురువారం బి.కోడూరు పీహెచ్‌సీ పరిధిలోని ప్రభలవీడు సచివాలయంలో డ్వాక్రా మహిళలకు ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

శ్రమదానం

ప్రొద్దుటూరు : స్వచ్ఛ తా హీ సేవా 2025 కార్యాక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఏక్‌దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమాన్ని మున్సిపాలిటి పరిధిలో నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సముదాయాల వద్ద గంట పాటు అధికారులు శ్రమదానం చేశారు.

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడిని నియంత్రించండి

ప్రొద్దుటూరు : ప్రైవేటు ట్రావెల్స్ దోపిడిని నియంత్రించాలని డీవైఎఫ్‌ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ గురువారం ఆర్టీఓ మనీషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు పండుగ సెలవులను ఆసరాగా చేసుకుని బస్సు టికెట్ ధరలను ఇష్టానుసారంగా పెంచి నిలువు దోపిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నుంచి హైదరాబాదు, చెన్నై, బెంగళూరు, విజయవాడ ప్రాంతాలకు ప్రైవేటు ట్రావెల్స్ నడపుతున్నారన్నారు. ట్రావెల్స్ యజమానులు పండుగ రోజుల్లో రెండింతలు వసూలు చేస్తున్నారన్నారు. సింగిల్ డ్రైవర్‌లను సర్వీసు రూట్లను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శేఖర్ పాల్గొన్నారు.


ఆర్టీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

డ్వాక్రా సభ్యులకు లాభాలు ఎప్పుడు పంచుతారు

ఖాజీపేట : డ్వాక్రా సభ్యుల ఆర్థిక సహాయంతో మహిళా మార్టును ఎర్పాటు చేశారు. కానీ వచ్చిన లాభాలను అధికారులు ఎప్పుడు పంచుతారని వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డిలు అధికారులను ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సభ్యుల సహకారంతో వారి వద్ద నుంచి పెట్టుబడి డబ్బులను వసూల్ చేశారని అన్నారు. అలా వచ్చిన డబ్బుతో అప్పుటి మాజీ సీఎం వైఎస్ జగన్ జిల్లాలోనే తొలి మహిళా మార్టు ఎర్పాటు చేశారన్నారు. డ్వాక్రా సభ్యుల నుంచి పెట్టుబడి డబ్బు తీసుకునే ముందు లాభాల్లో అందరికీ వాటా ఉంటుందని లాభాలు వచ్చినప్పటి నుంచి అందరికి పంచుతామన్నారు. నేడు మహిళా మార్టు పూర్తి లాభాల్లోకి వచ్చిందన్నారు. మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు లాభాలు పంచలేదన్నారు. అధికారులను డ్వాక్రా సభ్యులు ఎన్ని సార్లు అడిగినా సరైన సమాదానం లేదన్నారు. వచ్చిన లాభాలను సభ్యులకు పంపిణీ చేయడంలో అధికారులకు వస్తున్న ఇబ్బంది ఎమిటో అర్థం కావడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

పోరుమామిళ్ల : బద్వేలు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని, నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ, కార్యకర్తలను ఆదుకోవాలని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం తాడేపల్లి లోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఆయన కుమారుడు, విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వైయస్. జగన్ నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. 2029లో పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, అందరి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.


వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఆదిత్యారెడ్డి

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కాశినాయన : ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని శ్రీ పుష్పాండజ మహర్షి ఆశ్రమం పీఠాధిపతి, తొగట వీరక్షత్రియుల కుల గురువు దివ్యజ్ఞానానంద గిరి స్వామి తెలిపారు. మండలంలోని ఆకుల నారాయణపల్లి, పగడాలపల్లి గ్రామాల్లోని చౌడేశ్వరి దేవి ఆలయాలను ఆయన సందర్శించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవచింతన కలిగి ఉండి తోటి వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం బి.కోడూరు మండలం ఆనంవారిపల్లి గ్రామంలోని చౌడేశ్వరి దేవి ఆలయాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడపకు చెందిన చౌడేశ్వరి దేవి భక్తులు సూరిబాబు, సానా విజయకుమార్, గురుబ్రహ్మం, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ పేరుతో భోజన కార్మికుల పొట్ట కొట్టొద్దు

పోరుమామిళ్ల : స్మార్ట్ కిచెన్ పేరుతో భోజన కార్మికుల కుటుంబాలను రోడ్డు పాలు చేయవద్దని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు చాంద్‌బాషా ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ల స్వలాభం కోసం 23 ఏళ్లుగా పని చేస్తున్న భోజన కార్మికుల పొట్టకొట్టి సెంట్రల్ కిచెన్, స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేయడం తగదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రేణుకమ్మ, మోహన్, రాజి పాల్గొన్నారు.